క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ప్రకాశం నగర్: కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే యానిమేటర్లందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని.. దాన్ని నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానిమేటర్ల ఆర్పీల యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి డిమాండ్ చేశారు. స్థానిక అంబల్ల సూర్యారావు భవన్‌లో శుక్రవారం ఆ యూనియన్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, చిరు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ కూటమి నాయకుల హామీలను నమ్మి ఓట్లు వేశారన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ అర్బన్‌లోని సంఘాలను రూరల్ లోకి మార్చాలని కోరారు. మూడు సంవత్సరాల కాలపరిమితి ఉన్న 64 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో తనిఖీలు



పాఠశాలలో తనిఖీలు చేస్తున్న నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ వెంకట రమణ

కంబాలచెరువు: స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు శనివారం నగరంలోని అన్ని పాఠశాలలను అధికారులు సందర్శించనున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. కాగా.. శుక్రవారం ఆర్డీవో కృష్ణ నాయక్ సీతంపేట, లిస్టర్ పేట పాఠశాలలను పరిశీలించారు. రాజమహేంద్రవరం అర్బన్‌కు పరిశీలన కోసం నియమితులైన ప్రత్యేక అధికారి, నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.వెంకటరమణ ఊటలంక, ఆనంద నగర్ పాఠశాలలను సందర్శించారు.

బాల సదనం బాలికలకు వితరణ



బాలికలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వ్యాపారవేత్త రాజేంద్ర

కంబాలచెరువు: దానవాయిపేట బాల సదనం బాలికల వసతి గృహంలోని బాలికలకు శుక్రవారం దుప్పట్లు, టవళ్లు, 25 కేజీల బియ్యం, బిస్కెట్ ప్యాకెట్లను వ్యాపార వేత్త పొట్రు రాజేంద్ర అందజేశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ వితరణ జరిపారు. కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, నిర్మల్ మాస్టారు, సదనం సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శాఖలో హెల్త్ ఎడ్యుకేటర్ల పాత్ర చాలా ప్రధానమైనదన్నారు. జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) డాక్టర్ సత్యకుమార్ నల్లూరి, ఆఫీస్ సూపరింటెండెంట్లు సత్యనారాయణ, స్టాలిన్, ఎపిడమాలజిస్ట్ సుధీర్, ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, ఎ.శ్రీను పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతి వస్తున్నాం
సూర్యమినీ	: దేవా
సూర్యప్యాలెస్	: ప్రేమిస్తావా, మదగజరాజు
స్వామి	: సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	: గేమ్‌ఛేంజర్
అనుశ్రీ	: మదగజరాజు
రాజా	: మదగజరాజు
ఊర్వశి	: పుష్ప-2
మేనక	: మహిష
రంభ	: స్కైఫోర్స్
కుమారి	: రాచరికం (మార్నింగ్ షో), పుష్ప-2 (2 షోలు)
అప్సర	: డాకు మహారాజ్
అశోక	: డాకు మహారాజ్
నామవరం	
వీఎస్ మహల్	: సంక్రాంతికి వస్తున్నాం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: సంక్రాంతికి వస్తున్నాం
కడియం	
వెంకటసూర్య	: సంక్రాంతికి వస్తున్నాం



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న మెయిన్ రోడ్డు



ఖాళీగా దర్శనమిస్తున్న కోటగుమ్మం సెంటర్

కళ తప్పిన మార్కెట్

- అమ్మకాలు అంతంతమాత్రం
- వ్యాపారుల ఆవేదన
- మొదలైన పెళ్లిళ్ల ముహూర్తాలు
- వ్యాపారాలు పెరుగుతాయని ఆశాభావం

ప్రకాశం నగర్: క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండగల నేపథ్యంలో కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్‌కు ప్రస్తుతం కళ తప్పింది. కొనుగోలుదారుల లేక వెలవెలబోతోంది. పండగ సమయంలో విపరీతమైన రద్దీ ఉండేది. భారీ ఎత్తున వ్యాపారం జరిగింది. పండగలు ముగిసిపోవడంతో అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్, గుండువారి వీధి, టౌన్ హాలు రోడ్డుతో పాటు వస్త్ర వ్యాపారానికి పేరు గాంచిన తాడితోట మహాత్మాగాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్‌లో భారీ ఎత్తున హోల్ సేల్, రిటైల్ వ్యాపారాలు జరుగుతాయి. సంక్రాంతి సమయంలో వీటితో పాటు జ్యూయలరీ షాపులు, కిరాణా దుకాణాలు, ఫాన్సీ షాపులు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల షాపులు కొనుగోలుదారులతో రద్దీగా ఉండేవి. ఇప్పుడు ఇవన్నీ అంతంత మాత్రంగా వచ్చిన కస్టమర్లతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

తగ్గిన వ్యాపారం

నగరంలోని మహాత్మా గాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ఉభయ గోదావరి జిల్లాలోనే అతి పెద్ద బట్టల మార్కెట్‌గా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ హోల్‌సేల్ వ్యాపారుల ద్వారా వస్త్రాలను చుట్టుపక్కల జిల్లాలకు, నగరాలకు చెందిన రిటైల్ వ్యాపారులకు ఎగుమతి చేస్తారు. అలాగే ఇక్కడి వ్యాపారులు ముంబై, సూరత్, కోల్‌కతా నుంచి వస్త్రాలను దిగుమతి చేసుకుంటారు. పండగ సీజన్ వరకు వ్యాపార కార్యకలాపాలు అత్యంత చురుగ్గా సాగాయని, అనంతరం కొనుగోలుదారులు లేకపోవడంతో వ్యాపార లావాదేవీలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.

డిమాండ్ పెరిగేనా..

జనవరి నెలాఖరు వరకూ పెళ్లి, గృహ ప్రవేశం వంటి ఇతర శుభ కార్యక్రమాలు లేకపోవడంతో అమ్మకాలు సన్నగిల్లాయని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ఫిబ్రవరి నుంచి జూన్ వరకు పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి. దీంతో దుస్తులు, బంగారు దుకాణాలతో పాటు వంట మనుషులు, సప్లయి కంపెనీ, లైటింగ్ , డెకరేషన్, కల్యాణ మండపాలకు డిమాండ్ ఏర్పడనుంది.

> **ఆశించిన స్థాయిలో లేవు**
>
> సంక్రాంతి పండగ సీజన్ వరకు చురుగ్గా సాగిన వ్యాపారం ప్రస్తుతం బాగా తగ్గింది. వస్త్ర వ్యాపార రంగంలోకి కార్పొరేట్ సంస్థలు వచ్చేశాయి. సామాన్యులు సైతం షాపింగ్ మాల్స్‌లోనే వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. యువత ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లలో వస్త్రాలను బుక్ చేసుకుంటున్నారు. ప్రసుత్తం సీజన్ లేకపోవడంతో వ్యాపారాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.
>
> – సత్యనారాయణ, వస్త్ర వ్యాపారి

రామకృష్ణ మిషన్ వైద్యశాలకు వితరణ



క్యాన్సర్ స్క్రీనింగ్ మెషీన్ అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రామకృష్ణ మిషన్ ధర్మ వైద్యశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో సుమారు రూ. 8 లక్షల విలువైన బ్రెస్ట్ సర్వేకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ మెషీన్, రూ. 20 వేలు విలువైన స్టెరిలైజర్‌ను వితరణ చేశారు. ఆ వైద్యశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యశాల ఇన్‌చార్జి స్వామి రఘువీరనందజీ మహారాజ్‌కు క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహారావు దీన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ యన్నమని రామచంద్రరావు మాట్లాడుతూ రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలకు ఈ మెషీన్ ఉపయోగపడుతుందన్నారు. రామకృష్ణ ధర్మ వైద్యశాలలో నిత్యం ఈ సేవలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ



శిక్షణ తరగతులలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణా తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఏఎంవో డి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసుకోవడంపై శుక్రవారం శిక్షణ ఇచ్చామన్నారు. దీనికి జిల్లా పోలీస్ యంత్రాంగం సహకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుగురు రాష్ట్ర స్థాయి శిక్షకులు, తూర్పుగోదావరి జిల్లా నుంచి 40 మంది, కాకినాడ జిల్లా నుంచి 20 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమావళి పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

రాజానగరం/కడియం: జాతీయ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులందరూ రోడ్డు భద్రతా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జాతీయ రహదారుల ప్రాజెక్టు మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం, టోల్ మేనేజర్ కర్రి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల ముగింపు సందర్భంగా ఎన్‌హెచ్ ఏఐ పీడీ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై వేమగిరి వరకూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రాజమహేంద్రవరం సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్, టోల్ ప్లాజా ఉద్యోగులతో జాతీయ రహదారుల టెక్నికల్ మేనేజర్ అన్సారీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై రూపొందించిన పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పెద్ద వాహనాల డ్రైవర్లు విధిగా సీట్ బెల్టును ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వస్తే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలు వీధిన పడకూడదన్నారు. అతివేగం ప్రమాదకరమని, వేగంకన్నా సురక్షిత ప్రయాణం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఇంజినీర్ ఈ.వెంకట రమణ, క్రైం సీఐ రాంబాబు, ధవళేశ్వరం సీఐ గణేష్, క్యాషియర్ సురేష్, టోల్ ప్లాజా మేనేజర్ కరీం, హెచ్‌ఆర్ రమేష్ పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్టు

బిక్కవోలు: పందలపాకలో కురుపూడి లలితేశ్వరి (33) హత్య కేసులో నిందితుడిని గత నెల 30వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో అరెస్టు చేసినట్టు అనపర్తి సీఐ సుమంత్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పందలపాక గ్రామానికి చెందిన గుత్తికోలు దుర్గాప్రసాద్‌తో కురుపూడి లలితేశ్వరికి వివాహేతర సంబంధం ఉంది. అయితే కొద్ది రోజులుగా అతడిని లలితేశ్వరి దూరం పెట్టింది. దీంతో దుర్గాప్రసాద్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 29వ తేదీన లలితేశ్వరిని ఆమె పనిచేసే బరకాల కొట్టు వద్దకు రావాలని పిలిచాడు. అక్కడ వారిద్దరికీ వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే ఉన్న కేబుల్‌ను లలితేశ్వరి మెడకు చుట్టు, గట్టిగా నొక్కి చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి దుర్గాప్రసాద్ పారిపోయాడు. పోలీసులు మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తులో హత్యగా తేలింది.

మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రకాశం నగర్: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేలా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఘోయల్ పిలుపునిచ్చారు. స్థానిక మావోభవన్‌లో శుక్రవారం ఏఐకేఎంఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. దీనికి జాతీయ అధ్యక్షులు టాన్యా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఘోయల్ మాట్లాడుతూ కేంద్రంలో వరసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్.. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలే పరమావధిగా ఊడిగం చేస్తుందని విమర్శించారు. టాన్యా మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేయడానికే డిజిటల్ అగ్రిమిషన్‌ను తీసుకువచ్చిందన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



పూర్వ విద్యార్థులు పంపిణీ చేసిన సైకిళ్లతో బాలికలు

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు (2018–19 బ్యాచ్) బొడ్డపాటి దుర్గారావు, వినోద్ కుమార్ శుక్రవారం పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న పేద బాలికలకు సుమారు రూ.70 వేల విలువైన ఎనిమిది సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు తల్లి బి.సత్యవతి, సోదరుడు సురేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.అప్పారావు, బి.వి జయ కుమారి, డాక్టర్ పుప్పాల బాపిరాజు, పి.రాంబాబు పాల్గొన్నారు.

డైరీలో నర్సరీల పూర్తి సమాచారం



డైరీని ఆవిష్కరిస్తున్న పోలరాజు, మార్గాని సత్యనారాయణ తదితరులు

కడియం: మండలంలోని అన్ని నర్సరీల పూర్తి సమాచారాన్ని డైరీలో పొందుపరచామని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, ప్రముఖ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ అన్నారు. కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ ముద్రించిన 2025 డైరీ, డైరెక్టరీని శుక్రవారం అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, ప్రముఖ నర్సరీ రైతులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నర్సరీ రైతులకు ఉపయోగపడే విదేశీ, స్వదేశీ మొక్కల సమాచారంతో పాటు మొక్కలను విదేశాలకు ఎగుమతి చేసే పరిజ్ఞానాన్ని పొందుపరిచామన్నారు. ఈ డైరీలో అన్ని నర్సరీ రైతుల ఫోన్ నంబర్లు, ఆయా నర్సరీలో లభ్యమయ్యే ఖరీదైన మొక్కల సమాచారాన్ని ప్రకటనల ద్వారా ముద్రించామన్నారు. కార్యక్రమంలో గట్టి సుబ్బారావు, పాతంశెట్టి చిన మహాలక్ష్మీ నాయుడు, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి భాస్కరరావు, రత్నం కష్ణమూర్తి, బొర్సు సుబ్బారాయుడు, బొర్సు వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెనుమాక కొండబాబు, కార్యదర్శి గాద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనమందరం పోలీసు కుటుంబ సభ్యులమే..



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

కంబాలచెరువు: ఉద్యోగ రీత్యా విరమణ పొందినప్పటికీ మనమంతా పోలీస్ కుటుంబ సభ్యులమేనని జిల్లా అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ (అడ్మిన్), అల్లూరి వెంకట సుబ్బరాజు (లా అండ్ ఆర్డర్), ఎల్.అర్జున్ (క్రైమ్) అన్నారు. జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన టీవీవీఎస్ సాంబశివరావు (ఎస్సై సీసీఎస్), పి.నాగరత్నం (వుమెన్ ఎస్సై మహిళా పోలీస్ స్టేషన్), కేహెచ్‌హెచ్ సుబ్రహ్మణ్యం (ఏఎస్సై ప్రకాశం నగర్)లను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఘనంగా సత్కరించారు. వారికి పూల మాలలు వేసి, జ్ఞాపికలు అందజేశారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎస్.భవ్య కిషోర్ (సౌత్ జోన్), బి.విద్య (ఈస్ట్ జోన్), రవి కుమార్ (ఏఆర్), ఇన్‌స్పెక్టర్ (డీసీఆర్‌బీ) పవన్ కుమార్ రెడ్డి, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, ఆర్‌ఐలు చంద్రశేఖర్, సంజీవ్ పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ కోసమే వైద్యశిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: పాడి పశువులకు వ్యాధులు సోకకుండా సంరక్షించడానికే పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తొర్రేడు పశువైద్యశాల వైద్యుడు ఏవీ ప్రసన్న కుమార్ తెలిపారు. కొంతమూరులో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో పశువులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందు పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. శిబిరంలో 80 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడిరైతులకు మినరల్ మిక్చర్, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ రమేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తీపర్తి బుల్లిబాబు మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: గడ్డి మందు తాగిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కవలగొయ్యి గ్రామానికి చెందిన తీపర్తి బుల్లిబాబు (45) ఈ నెల 26వ తేదీన తన భార్యను మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో ఆమె చెప్పడంతో గడ్డిమందు తాగేశాడు. వెంటనే అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుల్లిబాబు భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫేస్ మార్ఫింగ్ చేసి మహిళకు బెదిరింపులు

రాజమహేంద్రవరం రూరల్: న్యూడ్ వీడియోలకు తన ఫేస్ మార్ఫింగ్ చేసి ఒక వ్యక్తి బెదిరిస్తున్నాడని 41 ఏళ్ల మహిళ శుక్రవారం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మహిళ ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించడంతో పాటు వీడియోలు పెడుతుంది. ఆమె ఇన్‌స్టాగామ్‌కు చాలామంది ఫాలోవర్స్ ఉన్నారు. అందులో ఒకరు న్యూడ్ వీడియోలకు ఆమె ఫేస్‌ను మార్ఫింగ్ చేసి పంపిస్తూ బెదిరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుపై ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా లక్ష్మి



నూతన అధ్యక్షురాలు లక్ష్మిని అభినందిస్తున్న నాగేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాజమహేంద్రవరం రెండో మండల అధ్యక్షురాలిగా అధికారి లక్ష్మిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. నూతనంగా ఎన్నికైన లక్ష్మిని శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ మండల అధ్యక్ష పదవిని పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తూ బీజేపీ అభ్యున్నతికి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి, ప్రతి ఒక్కరిని బీజేపీకి ఆకర్షితులను చేస్తూ, పార్టీ అభివృద్ధికి పాటు పడాలన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో మండల కమిటీ నిర్మాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హారిక, సిటీ అసెంబ్లీ కో కన్వీనర్ రత్నా రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



వాసవీమాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

కడియం: గ్రామంలోని వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం కడియం మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి నాగేశ్వరరావు (నాగబాబు) ఆధ్వర్యంలో ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, వాసవీ మాత సహస్ర స్తోత్రం పఠించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు, కడియం గ్రామ ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేతి నానాజీ, చెక్కా కాశి, బొడ్డు సత్యనారాయణ, వెత్సా లక్ష్మీనారాయణ, ఒబిలిశెట్టి సాయి పాల్గొన్నారు.

రోడ్డు దాటితే ఇల్లు.. కాటేసిన మృత్యువు

- టిప్పర్ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి
- కోటపాడులో ఘటన

రంగంపేట: టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మోటారు సైక్లిస్టు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని కోటపాడు శివారు అంబేడ్కర్ కాలనీకి చెందిన అర్జంగి ఆనందరావు (45) కాకినాడ పోర్టులో డైలీ కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని కాకినాడ నుంచి కోటపాడుకు తన మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. కోటపాడు అంబేడ్కర్ కాలనీ వద్దకు వచ్చేసరికీ అయనను వెనుక నుంచి వచ్చిన టిప్పర్ వేగంగా ఢీకొని, కొంత దూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో ఆనందరావు తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని బంధువులు వెంటనే 108లో పెద్దాపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డు దాటితే ఇంటికి వచ్చేసే వాడని, ఇంతలోనే లారీ రూపంలో మృత్యువు కబలించిందని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. ఈ ప్రమాదంపై ఇంకా ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రేపు దివాన్ చెరువులో మహాకుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వరీ అమ్మవారు

రాజానగరం: దివాన్ చెరువులోని హేరంబ గణపతి, బాలకుమారస్వామి సహిత విశ్వేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం జరుగుతుంది. దీనిలో భాగంగా ఆలయంలో కొలువైన జగన్మాతకు మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ కంభంపాటి రామ సుబ్రహ్మణ్యం (రాంబాబు) దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలలో భాగంగా నాలుగు రోజులుగా సాయంత్రం వేళలో సంగీత కచేరీ, పద్యగానం, కూచిపూడి నృత్యం, భాగవతోపన్యాసం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వీణా వాదం జరిగింది. శనివారం సద్గురు కందుకూరి శివానందమూర్తి శిష్యపరివారంచే 'గురువందనం' పేరుతో భక్తినీరాజనం సమర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్ లభించిందని చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ జనవరి 23, 24 తేదీలలో న్యాక్ టీం కళాశాలను సందర్శించి, ప్రణాళికబద్ధంగా అన్ని విషయాలను పరిశీలించిందన్నారు. కళాశాలలో ఉత్తీర్ణత వంద శాతం వస్తోందని, బహుళ జాతి కంపెనీలలో ఒక్కొక్క విద్యార్థినీ ఏడు నుంచి 13 ఉద్యోగాలు సాధించడమే గాక, ఎన్ఎస్ఎస్.ద్వారా సమాజ సేవతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ముందుంటున్నారన్నారు.